కొలువుదీరేందుకు సిద్ధమైన గణనాథుడు


ఉంగుటూరు: నారాయణపురంలో సిద్ధమైన గణేశ్ ప్రతిమలు


భీమడోలు: పూళ్లలో సిద్ధమైన మట్టి వినాయక ప్రతిమలు


భీమడోలు: పూళ్లలో మట్టి వినాయక విగ్రహాన్ని తీర్చిదిద్దుతున్న కళాకారుడు

- ఉత్సవాలకు ఆలయాలు, మందిరాలు ముస్తాబు
- ఆకర్షణీయంగా విద్యుద్దీపాలంకరణ

ఉంగుటూరు: ఉత్సవ మండపాలలో కొలువై పూజలందుకునేందుకు గణనాథులు ముస్తాబయ్యారు. వివిధ ఆకృతులలో గణేశ్ ప్రతిమలను తయారీదారులు సిద్ధం చేసి ఆకర్షణీయంగా రంగులు అద్దారు. జిల్లాలో పలుచోట్లు గణనాథుడి ప్రతిమలు తయారు చేస్తారు. ఏలూరు జిల్లాలో ఏలూరు, దెందులూరు, భీమడోలు, చేబ్రోలు, నారాయణపురం గణపవరం, పెదపాడు, పెదవేగి, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, కొయ్యలగూడెం తదితర మండలాల్లో గణేశ్ ప్రతిమలను తయారు చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో వీటిని తయారు చేశారు. రూ.3 వేల నుంచి రూ.50 వేల విలువగల ప్రతిమలు సిద్ధంగా ఉన్నాయి. విగ్రహాల తయారీ ప్రక్రియం ఆరునెలల నుంచి ప్రారంభించినట్టు కళాకారులు తెలిపారు. ఈ విగ్రహాలు తయారుచేసి విక్రయించేందుకు రాజస్థాన్ నుంచి అనేక కుటుంబాలు ఏలూరు జిల్లాకు వచ్చాయి. విగ్రహాల విక్రయంతో వచ్చిన డబ్బుతో ఏడాది పొడవునా జీవనం సాగిస్తుంటామని వారన్నారు. వినాయకుని చవితి అనంతరం ఒకసారి రాజస్థాన్‌లోని స్వగ్రామం వెళ్లి వస్తామని వారన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు విగ్రహాలను తరలించే ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభించారు. మేళతాళాలతో వీటిని ట్రాక్టర్లు, ఆటోలు, చిన్న లారీలు సాయంతో తరలిస్తున్నారు. ఎంతో ఉత్సాహంగా గణేశ్ ఉత్సవాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

మట్టి గణపతి మనసాస్మరామి

గణపవరం: పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు నడుం కట్టారు. వినాయకచవితి పండుగను సంప్రదాయ బద్ధంగా, పర్యావరణ హితంగా చేసుకుంటామని చిన్నారులు ప్రతిన బూనారు. చిన్నారులు తమ చిట్టి చేతులతో పర్యావరణానికి ఏమాత్రం నష్టం చేయని నల్ల మట్టితో గణపతి ప్రతిమలను తయారు చేశారు. వీటిని సోమవారం వినాయచవితి పూజలలో ఉపయోగిస్తామని వారు తెలిపారు. శనివారం గణపవరం, నిడమర్రు మండలాల్లోని పలు పాఠశాలల్లో చిన్నారులు మట్టి గణపతులను అందంగా తీర్చిదిద్ది ఉపాధ్యాయుల ప్రశంసలు అందుకున్నారు. కొందరు విద్యార్థులు తయారుచేసిన గణపతి ప్రతిమలను ఉపాధ్యాయులకు బహూకరించారు.

మట్టి వినాయకుని పూజిద్దాం

పెదపాడు: మట్టి వినాయకుని పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చునని పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం పాఠశాలల్లో విద్యార్థులు మట్టి వినాయకుని ప్రతిమలు తయారు చేసారు. ఈ పోటీల్లో 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేసారు.

పూళ్లలో మట్టి ప్రతిమల తయారీ

భీమడోలు: గణేశ్ ఉత్సవాలకు గ్రామాలు సర్వం సిద్ధమవుతున్నాయి. భీమడోలు, పూళ్ల, గుండుగొలను, కొల్లేరు గ్రామాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కమిటీలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసాయి. ఈనెల 18వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో మందిరాల్లో కొలువుదీరేందుకు గణేశ్ విగ్రహాలు సిద్ధమయ్యాయి. పూళ్లలోని కళాకారుడు యర్రవరపు బుల్లియ్య దశాబ్దాలుగా పర్యావరణానికి హితంగా ఉండే మట్టి, సిమెంట్, సున్నంతో గణనాథుడు, దుర్గమ్మ మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నారు. పూళ్ల, అంబర్‌పేట గ్రామాల్లో మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నారు. 3 నుంచి 6 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఒక్కొక్క విగ్రహం రూ.5వేల నుంచి రూ.12వేల వరకు రేటు ఉంటుందని కళాకారుడు బుల్లియ్య పేర్కొన్నారు.

ఉత్సవాల నిర్వహణలో నిబంధనలు పాటించాలి


పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్

పెదవేగి : వినాయక చవితిని పురస్కరించుకుని ఉత్సవాలు నిర్వహించేవారు ప్రభుత్వ నిబంధనలను అనుసరించాలని పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు. వినాయకచవితిని పురస్కరించుకుని ఎస్సై ఉత్సవాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఉత్సవాల నిర్వహణ సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆయన చెప్పారు. ప్రధాన రహదారులను మూసివేస్తూ విగ్రహాలను ఏర్పాటు చేయరాదని, మైక్ ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలన్నారు. వినాయక నిమజ్జనం సమయంలో మద్యం సేవించి, నృత్యాలు చేయడం, అశ్లీల నృత్యాలను ఏర్పాటు చేయడం వంటివి చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇతర మతాలను కించపరచకుండా జాగ్రత్తలు తీసుకుంటూ వినాయక చవితిని ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్సై సూచించారు.

పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ కృషి

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- ఉంగుటూరులో నూతన పింఛన్లు పంపిణీ


ఉంగుటూరులో నూతన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ఉంగుటూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి వారి పక్షాన పనిచేస్తున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఉంగుటూరులో శనివారం పాతూరి కల్యాణ మండపంలో నూతనంగా మంజూరైన 614 పింఛన్లను ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇప్పటి వరకు రూ.3.22కోట్లు ప్రతి నెలా ఉంగుటూరు మండలంలో పింఛన్ల రూపంలో లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. 65 ఏళ్ల ఉండే పింఛన్ల అర్హత వయస్సును 60 ఏళ్లకు కుదించడంతో అనేక మందికి అవకాశం లభించడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన విధానం వల్ల సాధ్యమైందన్నారు. గతంలో సంక్షేమ పథకాలకు రూ. 500 కోట్లు ఖర్చు చేస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.1,800 కోట్లు నేరుగా సంక్షేమానికి వెచ్చిస్తున్నట్టు తెలిపారు. పేదలు ఆర్థికంగా బలపడాలనే ఆలోచనతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వాసుబాబు తెలిపారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా పథకాలు, రేషన్ నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామాల్లో నిర్వహిస్తున్నారని, దీని వల్ల పేదల కుటుంబాల్లో ఆరోగ్య సమస్య తలెత్తితే ప్రభుత్వం నేరుగా అన్ని పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందిస్తుందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎల్లో మీడియా ప్రచారాలు, ప్రతిపక్షాల విమర్శలు పట్టించుకోవద్దని వాసుబాబు అన్నారు. ప్రతిపక్షాలు పేదవారిని పట్టించుకునే దాఖలేవని అన్నారు. సమావేశానికి మండల సచివాలయ కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ అధ్యక్షత వహించారు. వైసీపీ మండల పార్టీ కన్వీనర్ మరడా మంగారావు మాట్లాడుతూ 3,648 కిలోమీటర్లు పాదయాత్ర చేయడం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజల కష్టసుఖాలు తెలుసుకుని పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఎంపీపీ ఘంటా శ్రీలక్ష్మి మాట్లాడుతూ పేదలకు సేవలందిస్తున్న సీఎం జగన్‌ను ఎవరూ మరవ లేరన్నారు. రైతు సలహా సంఘం చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ కొరిపెల్లి జయలక్ష్మి, వైసీపీ పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి ప్రభుత్వ పథకాలను వివరించారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కొండేటి సర్వేశ్వరరావు, ఎంపీటీసీ-2 సందక రాంబాబు, అప్పారావుపేట సర్పంచ్ ఆంజేయులు, బొమ్మిడి సొసైటీ అధ్యక్షులు మేడవరపు బుజ్జి, కొత్తూరు శ్రీనివాసరాజు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వేదికనలంకరించారు. ఆయా గ్రామాల వారీగా మంజూరైన పింఛన్లను వృద్ధులకు పంపిణీ చేశారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల నుంచి నూతనంగా మంజూరైన పింఛన్ లబ్ధిదారులు తరలివచ్చారు.

నేడు వాసుబాబు కార్యక్రమాలు

గణపవరం: ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఈనెల 17వ తేదీ ఆదివారం ఉదయం క్యాంపు కార్యాలయంలో గణపవరం, నిడమర్రు మండలాలకు నూతనంగా మంజూరైన పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. ఉదయం 9 గంటలకు నిడమర్రు మండలానికి మంజూరైన 417 పింఛన్లు, 10.30 గంటలకు గణపవరం మండలానికి మంజూరైన 467 పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. సాయంత్రం 4న గంటలకు భీమడోలు ఎంపీడీవో కార్యాలయంలో భీమడోలు మండలానికి నూతనంగా మంజూరైన 548 పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు మేధినరావుపాలెం విద్యార్థులు


రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దెందులూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు మేధినరావుపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు టీ.గణేష్ (40 కేజీలు), టీఎంవీఎస్ దుర్గ (58 కేజీలు), శాంతిదీప్ (70 కేజీలు) రాష్ట్రస్థాయి శనివారం పెదవేగి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాస్థాయి పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. విజయవాడలో ఈ నెల 21 నుంచి 23 వరకు రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని హెచ్‌ఎం హరిసీతారామయ్య, ఫిజికల్ డైరెక్టర్ రవి అన్నారు. మేధినరావుపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులను ఫెడరేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ కృష్ణారావు, దెందులూరు మండల కోఆర్డినేటర్ సురేష్, ఎంఈఓలు కే.అన్నమ్మ, సీహెచ్‌బుద్ధా వ్యాస్, ఏవీఎస్‌వీ ప్రసాద్, మేధినరావుపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీతారామయ్య, పీడీ రవి అభినందించారు.

ఉపాధ్యాయులకు ఘన సత్కారం


భోగాపురంలో ఉపాధ్యాయుడు రామారావును సత్కరిస్తున్న సర్పంచ్, గ్రామ నాయకులు

పెదవేగి : ఊరికి దూరంలో ఉన్న పిల్లల ఇంటికి వెళ్లి వాళ్లందరినీ బడికి తీసుకొచ్చి చదివించడమే కాకుండా పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయుల సేవలను గ్రామం ఎన్నటికీ మరిచిపోదని సర్పంచ్ దిమ్మిటి నాగమల్లేశ్వరి అన్నారు. మండలంలోని భోగాపురం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు నల్ల రామారావు, రజినీ పదోన్నతిలో భాగంగా బదిలీ అయ్యారు. గ్రామస్తులు పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శనివారం వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. దీనికి ప్రధానోపాధ్యాయుడు వీరంకి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. సర్పంచి దిమ్మిటి నాగమల్లేశ్వరి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. పాఠశాల కాంప్లెక్స్ సెక్రటరీ ఆలూరి నాగరాజు ఆధ్వర్యంలో వీడ్కోలు సభను విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రామారావు, రజినీ సేవలను కొనియాడి వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దిమ్మిటి రమేష్, పేరెంట్స్ కమిటీ సభ్యుడు శ్యాం బాబు, ఉపాధ్యాయులు ప్రవీణ, శైలజ, కవిత, జాబిల్లి, తోమాటి ఎడ్వర్డ్, తేరా ప్రభాకర్, నాగార్జున, గుడిమిల్లి వెంకటేశ్వరరావు, పోలిరెడ్డి వెంకట రమణ, సాయిరాజు భల్లం, సిఆర్పి రవి పాల్గొన్నారు.

మానవ హక్కులు బాలలకూ వర్తిస్తాయి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బాలల హక్కులతో పాటు మానవ హక్కులు కూడా బాలలకు కూడా వర్తిస్తాయని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు అన్నారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో ఏలూరులోని పాత బస్టాండ్ సెంటర్ కొప్పాక స్టాండ్‌లో జై భారత్ ఆటో యూనియన్ కార్మికులకు బాలల పరిరక్షణపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆపదలో ఉన్న బాలలను పరిరక్షించుదామని, 18 ఏళ్ల లోపు వారంతా బాలలే అని అన్నారు. బాలల పట్ల లైంగిక వేధింపులు వంటి ఘటనలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని, బాల్య వివాహాన్ని ప్రోత్సహించిన తల్లిదండ్రులు, సంరక్షకులకు కూడా శిక్ష పడుతుందని హెచ్చరించారు. విద్యార్థి దశ నుంచే సరైన అవగాహన కలిగిస్తే మత్తుపదార్థాలకు బానిసలూ కాకుండా, సమాజంలో మంచి పౌరులుగా బాలలు తీర్చిదిద్దబడతారని అన్నారు. డీ ఎడిక్షన్ చికిత్స ద్వారా మత్తు పదార్థాల వ్యసనం నుంచి సాధారణస్థితికి తీసుకురావచ్చని, ఈ చికిత్స కోసం తమ సంస్థ నూజివీడు మండలం పొలసానిపల్లిలో బోస్కో డీఎడిక్షన్‌సెంటర్ ఏర్పాటు చేశామని, సెల్ నెంబర్ 94904 92020లో ఉచితంగా సంప్రదించవచ్చని వివరించారు. జై భారత్ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ కొయ్యూరు బాబురావు, సెక్రెటరీ తుమ్మాటి సరస్వతీరావు, నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్స్, బి.నేహేమియ పాల్గొన్నారు.

ముమ్మరంగా 'గడపగడపకు' హామీల అమలు


బువ్వనపల్లిలో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి మార్కింగ్ చేస్తున్న అధికారులు

గణపవరం: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేల దృష్టికి తీసుకువచ్చిన ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఏడాది కాలంగా వైఎస్సార్ సీసీ ప్రభుత్వం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తోంది. ఎమ్మెల్యేలు ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల వ్యక్తిగత సమస్యలతోపాటు ఇతర సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యల పరిష్కారానికి ఒక్కో గ్రామ సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. గడపగడపకు కార్యక్రమం నూరుశాతం పూర్తయిన గ్రామాలకు ఈనిధులు విడుదల చేస్తారు. దీనితో గ్రామాల్లో ఆయా సమస్యల పరిష్కారం దిశగా పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 75 గ్రామ సచివాలయాలకు ఇప్పటి వరకూ 55 సచివాలయాల పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నూరుశాతం పూర్తయింది. దీనితో నియోజకవర్గానికి రూ.21 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఆయా సచివాలయాల పరిధిలో పనులు చేపట్టారు. సీసీ డ్రెయిన్లు, సిమెంట్ రోడ్లు, ప్రహరీల నిర్మాణానికి ఈ నిధులను వినియోగిస్తున్నారు. గణపవరం మండలంలో జల్లికొమ్మర, పిప్పర గ్రామాల్లో ఇప్పటికే డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తికాగా, మిగిలిన చోట్ల పురోగతిలో ఉన్నాయి. ఇటీవలే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నూరుశాతం పూర్తయిన సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు.

90 శాతం సమస్యల పరిష్కారం



ఉంగుటూరు నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఇటీవలే 200 రోజులు పూర్తయింది. సుమారు 55 గ్రామ సచివాలయాల పరిధిలో నూరు శాతం పూర్తికాగా మిగిలిన సచివాలయాల పరిధిలో 50 నుంచి 60 శాతం పూర్తయింది. సుమారు 2,600 సమస్యలు ప్రజలు తెలపగా వాటిలో 90 శాతం పరిష్కరించాం. మిగిలినవి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారమవుతాయి.

– పుప్పాల వాసుబాబు, ఎమ్మెల్యే

ఆరోగ్య సురక్ష పథకాన్ని జయప్రదం చేయండి


జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం ఉంగుటూరులో ఆరోగ్య శాఖ ముద్రించిన జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. జగనన్న సురక్షలో ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి రోగులను గుర్తించి, గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేసి వారికి వైద్య సేవలందిస్తారని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు జయప్రదం చేయాలని సూచించారు. చేబ్రోలు పీహెచ్‌సీ డాక్టరు శ్రావణరెడ్డి, ఏఎన్ఎంలు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, మండల కన్వీనర్ మరడ మంగరావు, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు మంద జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
దెందులూరు, ఉంగుటూరు
9912220559
90102 23729
63097 62918
Office mail : tpgadvt@gmail.com

క్లుప్తంగా

గర్భిణులకు వరం వైఎస్సార్ సంపూర్ణ పోషకాహారం


గణపవరంలో గర్భిణులు, బాలింతలతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారులు

గణపవరం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం గర్భిణులు, బాలింతలకు వరమని, ఈ పథకాన్ని అందరూ వినియోగించుకోవాలని ఐసీడీఎస్ అధికారులు అన్నారు. శనివారం గణపవరం వెలంపేట అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాల్లో భాగంగా మహిళలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణపోషణ పథకంతో రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, మహిళలకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సభ్యులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు.

కాలుష్యంతో ఓజోన్‌కు ముప్పు


ఓజోన్ ఆవశ్యకతను విద్యార్థులకు వివరిస్తున్న లయన్స్ జోన్ చైర్మన్ మూర్తి

గణపవరం: సమస్త జీవరాశి మనుగడకు కారణమైన ఓజోన్ పొరను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ కె.సత్యనారాయణమూర్తి అన్నారు. శనివారం ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ఓజోన్ ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గణపవరం చాణక్య జూనియర్ కాలేజీ, బువ్వనపల్లి యూపీ పాఠశాలల్లో ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. వాతావరణ కాలుష్యంతో ఓజోన్ పొరకు ముప్పు కలుగుతుందని, వాతావరణ కాలుష్యానికి కారణమైన ప్లాస్టిక్ వినియోగాన్ని మానుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ అడబాల సూరిబాబు, హెచ్‌ఎం ఏసుబాబు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రావూరి నాగరాజు, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

నూతన పోలింగ్ స్టేషన్ల పరిశీలన


వట్లూరు నూతన పోలింగ్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్

పెదపాడు: ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు పెదపాడు మండలలలోని 6 పోలింగ్ స్టేషన్లు తనిఖీ చేసినట్లు దెందులూరు నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారి జీవీ సత్యనారాయణ తెలిపారు. శనివారం పెదపాడు మండలంలోని పాత పోలింగ్ స్టేషన్లు మార్పు చేసేందుకు వట్లూరులో 3 పోలింగ్ బూత్‌లు, రాజుపేట పోలింగ్ స్టేషన్‌ను, అప్పనవీడు సచివాలయం వద్ద పోలింగ్ స్టేషన్, తాళ్లమూడి ఉన్నత పాఠశాలలోని పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ జీ విజయకుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా కాపు నేస్తం


పెదవేగిలో కాపు నేస్తం లబ్ధిదారుల వివరాలు తెలియజేస్తున్న ఎంపీపీ తాతా రమ్య

పెదవేగి : మహిళలను ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా ప్రభుత్వం కాపు నేస్తం పథకాన్ని అమలు చేసిందని పెదవేగి ఎంపీపీ తాతా రమ్య అన్నారు. పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ పెదవేగి మండలంలో 807 మందికి కాపు నేస్తం పథకంలో ఆర్థికసాయం అందించామన్నారు. అందులో 90 మందికి కొత్తగా ఆర్థికసాయం అందించామని, వారంతా ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధిని సాధించడమే ధ్యేయంగా ఆర్థిక సాయం అందించామని ఆమె తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి మహిళల ఆర్థికస్వావలంబనకు విశేష కృషి చేస్తోందని ఆమె చెప్పారు. కులమతాలు, పార్టీలకు తావులేకుండా అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తోందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి రాజ్‌మనోజ్ ఉన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో కొవ్వలి విద్యార్థుల ప్రతిభ

దెందులూరు: దెందులూరు మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కొవ్వలి ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటి విజయం సాధించడం సంతోషంగా ఉందని కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్ఎన్ఎల్ వీజీ శర్మ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి కోఆర్డినేటర్, ఫిజికల్ డైరెక్టర్ జక్కుల సురేష్‌కుమార్ అన్నారు. శనివారం పాఠశాలలో వారు మాట్లాడుతూ షార్ట్‌పుట్‌లో ఈ. జీవన్, 100 మీటర్ల పరుగులో జీ.ఏసమ్మ, హైజంప్‌లో ఎం.ప్రవీణ్ కుమార్ ప్రథమస్థానం సాధించారని తెలిపారు. ఎన్.రవి డిస్కస్‌త్రో ప్రథమస్థానం, హేమంత్ 200 మీటర్లు పరుగులో మొదటి స్థానం సాధించారని అన్నారు. పాఠశాలకు చెందిన 17 మంది వివిధ విభాగాల్లో ప్రథమస్థానం సాధించారని శర్మ, కోఆర్డినేటర్ సురేష్ అన్నారు. విజేతలను వారు అభినందించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

దెందులూరు: మత్తు పదార్థాలపై యువత జాగ్రత్తగా ఉండాలని వాటి బారిన పడితే జీవితాన్ని పూర్తిగా కోల్పోతామని కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శర్మ, నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ వీ శేఖర్‌బాబు అన్నారు. శనివారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్కీన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్స్ బీ. మహేమియా, రజిత, జాకబ్‌రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ

ఉంగుటూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం ఓటర్లు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆర్డీవో కాజీ వల్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. జూలై నుంచి అగస్టు 21 వరకు 40రోజులు ఇంటింటా సర్వే బీఎవోలు నిర్వహించారని ఆయన తెలిపారు.

కృత్రిమ అవయవాల అందజేత

ఏలూరు రూరల్ : జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం అందిస్తోన్న సహకారాన్ని ప్రతి ఒక్కరూ అందుకోవాలని పునరావాస కేంద్రం కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం ఏలూరులో పలువురు దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందించారు. దివ్యాంగుల కోసం కృత్రిమ అవయవాలు, ఫిజియోథెరపీ, అడియోలజీ, స్పీచ్‌థెరపీ సేవలు అందిస్తున్నామని శ్రీనివాసరెడ్డి చెప్పారు. అవసరమైన వారు పునరావాస కేంద్రాన్ని సంప్రదించి సేవలు అందుకోవాలని సూచించారు.

నేటి నుంచి మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కుండీ సెంటర్‌లో ఉన్న హజరత్ మౌలా అలీ మహాత్ముని ఆస్థాన (గొలుసుల పంజా)లో జష్నే ఈద్ మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలుకీ ఆదివారం నుంచి నిర్వహించనున్నట్టు ఆ సంస్థ వంశపారంపర్య ముజావర్లు ఎండీ వజీర్ అలీ, ఎండీ గాలబ్ అలీ, ఎండీ మౌలా అలీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా ఉదయం 7 గంటల నుంచి నగరంలోని మసీదులకు చెందిన పేష్ ఇమామ్‌లు, మత గురువులు ఖురాన్ పారాయణం అనంతరం దరూద్ సలాం, ఫాతెహా ఖానీ నిర్వహిస్తారని తెలిపారు.